క్లుప్తంగా

ఎరువుల షాపుల తనిఖీ

రెండు షాపుల్లో సేల్స్ నిలుపుదల



పీబీ దేవంలో ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

సామర్లకోట: మండలంలోని ఎరువులు, పురుగు మందుల షాపులను వ్యవసాయాధికారులు సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. పీబీ దేవం గ్రామంలోని శ్రీలక్ష్మీ కల్యాణి ఎంటర్‌ప్రైజెస్, వేట్లపాలెంలోని శ్రీసత్యసాయి ఏజెన్సీల్లో తనిఖీలు చేపట్టారు. జిల్లా వనరుల కేంద్రం ఉప సంయుక్త సంచాలకుడు వీఏఎస్ హరి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్స్, అమ్మకం, కొనుగోలుకు చెందిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. రిజిస్టర్లతో స్టాక్‌ను చెక్ చేశారు. రైతులకు ఇవ్వాల్సిన బిల్లులు ప్రభుత్వం సూచించిన ఫారం ఎం విధానంలో కాకుండా, వేరే ప్రక్రియలో ఉన్నందున ఆ రెండు షాపులలో ఉన్న రూ.8,03,635 విలువ కలిగిన స్టాక్ అమ్మకాలు నిలుపుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీల్లో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి సంజీవ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి ఐ.సత్య తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం



బాధితురాలికి ఆర్థిక సాయం అందిస్తున్న మత్స్యకార నాయకుడు విఘ్నేశ్వరరావు

కొత్తపల్లి: మండలంలోని అమీనాబాద్ గ్రామానికి చెందిన గంటా దుర్గ గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న స్థానిక మత్స్యకార నాయకుడు మడద విఘ్నేశ్వరరావు సోమవారం వైద్య ఖర్చుల నిమిత్తం రూ.3 వేల ఆర్థిక సాయం అందించారు. కాగా పేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులకు దుర్గ తీవ్ర ఇబ్బందులు పడుతోంది. దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

కళాశాలకు బ్లాక్ బోర్డుల అందజేత



కళాశాలకు బ్లాక్ బోర్డులు అందజేసిన దాతలు

పిఠాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనంలో సౌకర్యాల కల్పనకు ప్లానింగ్, డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం విశ్రాంతి ఉపాధ్యాయుడు ప్రసాద్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 10 బ్లాక్ బోర్డులను కళాశాలకు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుభాషిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన నగర సంకీర్తన

పిఠాపురం: గొల్లప్రోలులో నెల రోజులుగా నిర్వహిస్తున్న నగర సంకీర్తన సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా భజన సమాజ సభ్యులను స్థానికులు శాలువా, పూలమాలలతో సత్కరించారు.

పంచారామ క్షేత్రంలో సీఎం ప్రత్యేక కార్యదర్శి



స్వామివారిని దర్శించుకుంటున్న ప్రద్యుమ్న దంపతులు

సామర్లకోట: ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి టీఎస్ ప్రద్యుమ్న దంపతులు సోమవారం స్థానిక పంచారామ క్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వారికి స్వాగతం పలికారు. స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్న వారికి ఆలయ పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. స్వామి ఫొటో, ప్రసాదాన్ని ఈఓ అందజేశారు.

సామర్లకోట అధికారులు

మున్సిపాలిటీ

మున్సిపల్ కమిషనర్	98499 05808
మున్సిపల్ మేనేజర్	98499 07118
మున్సిపల్ డీఈ	96769 68282
మున్సిపల్ ఏఈ	98499 07122
మున్సిపల్ ఆర్వో	98499 07120
మున్సిపల్ ఆర్ఐ	90146 00920
మున్సిపల్ టీపీఓ	98499 07123
శానిటరీ ఇన్‌స్పెక్టర్	77024 48282
అకౌంట్స్ ఆఫీసర్	98499 02447

రైతులతో దోబూచులాట

- తుపానుతో అన్నదాతల ఆందోళన
- ఏం చేయాలో తెలియక అయోమయం
- దళారుల చేతికి చేరుతున్న ధాన్యం



వీకే రాయపురంలో బరకాలు కప్పిన ధాన్యం రాశులు



ధాన్యం ఒబ్బిడి చేసుకుంటున్న రైతు

సామర్లకోట: ఫెంగల్ తుపాను పేరుతో వాతావరణం రైతులతో దోబూచులాడుతోంది. రెండు రోజులుగా చినుకులు పడుతూండటంతో రైతులు తమ ధాన్యాన్ని బరకాలు కప్పి కాపాడుకుంటున్నారు. భారీ వర్షాలు కురిస్తే బరకాల వలన ప్రయోజనం శూన్యమని రైతులు వాపోతున్నారు. అయితే సోమవారం ఉదయం నుంచి వాతావరణం అప్పటికప్పుడే మబ్బులు వేయడం, మరికొద్ది సమయానికి ఎండ రావడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. దాంతో వరి కోత యంత్రాల నుంచి వచ్చిన ధాన్యం ఆరబెట్టడానికి సిద్ధం కాగా, వాతావరణంలో మార్పులతో రైతులు పచ్చి ధాన్యాన్ని విక్రయించడానికి సిద్ధపడుతున్నారు. అయితే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పచ్చి ధాన్యం తీసుకోకపోవడంతో రైతులు గత్యంతరం లేక దళారులకు ధాన్యం విక్రయిస్తున్నారు. దాంతో 75 కేజీల బస్తా రూ.1,720 ఉండగా, పచ్చి ధాన్యం 75 కేజీలు రూ.1,380 నుంచి రూ.1,400కు విక్రయించాల్సి వస్తోంది. ఆరబెట్టిన ధాన్యాన్ని రూ.1,640కి కొనుగోలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు.

ప్రారంభం నుంచీ..

ప్రస్తుత సార్వా సీజన్ ప్రారంభం నుంచి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆగస్టు నుంచి వరుసగా వర్షాలు రావడంతో అనేక మంది రైతుల వరి నాట్లు నీటిలో మునిగాయి. రెండో పర్యాయం నాట్లు వేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దాంతో ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి అయిందని రైతులు వాపోతున్నారు. గత ఏడాది సార్వా సీజన్‌లో ఎకరానికి 40 నుంచి 45 బస్తాల దిగుబడి రాగా, ప్రస్తుతం 30 నుంచి 35 బస్తాలు మాత్రమే దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. నీట మునిగిన వరి చేలలో ఎకరానికి 20 బస్తాల కంటే ఎక్కువ రావడం లేదని వ్యవసాయాధికారులే అంగీకరిస్తున్నారు. సీఎంఆర్‌లో రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించినా, రవాణా చార్జీలు రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కూలీలతో వరి కోతలు చేయగా, పనలపై పంట చేలలోనే ఉంది. పనలు ఆరకపోతే కుప్పలు వేయడం సాధ్యం కాదని రైతులు అంటున్నారు.

పనలపై పంట

సామర్లకోట మండలంలో సుమారు 20 ఎకరాల్లో మాత్రమే పనలపై పంట ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పంట ప్రారంభం నుంచి కోతలకు వచ్చే వరకు వర్షాల పేరుతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. సార్వా పంట పూర్తిగా కోతకు సిద్ధం కావడంతో, వర్షాలు, గాలి వస్తే పంట నీట మునిగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు మండలంలో తుపాను ప్రభావం ఎక్కువగా లేకపోవడంతో కొంత వరకు రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

కోత యంత్రాలకు డిమాండ్



వరి కోత యంత్రాలకు డిమాండ్ ఏర్పడటంతో గత ఏడాది రూ.2 వేల నుంచి రూ.2,200 ఉండే అద్దె.. ప్రస్తుతం రూ.మూడు వేలు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. అధికారులు వరి కోత యంత్రాలకు అద్దె నియంత్రించ లేదు. పెట్టుబడి పెరిగి, దిగుబడి తగ్గిపోవడంతో రైతులు నష్టపోయే స్థితిలో ఉన్నారు. సీఎంఆర్‌లో రవాణా చార్జీలు చెల్లించడం లేదు.

– ఇంటి వెంకట్రావు, రైతు, వీకే రాయపురం

సమస్యల సత్వర పరిష్కారానికి గ్రీవెన్స్



గ్రీవెన్స్‌లో అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆర్డీవో శ్రీరమణి అన్నారు. గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి తొమ్మిది అర్జీలు అందినట్లు చెప్పారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఇందుకు డివిజన్ స్థాయిలో అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆయా శాఖల మండల స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఈ వారం అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించినట్టు ఆర్డీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సరిత, సీడీపీఓ ఉష, హౌసింగ్ అధికారి రవిశంకర్, డీవైఈఓ శర్మ, చప్పిడి రాజు తదితరులు పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం

ముస్తాబైన చదలాడలోని సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయం



చదలాడలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



షష్ఠి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం: మెట్ట ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన మండలంలోని చదలాడ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాల మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయ ఉత్సవ పోస్టర్‌ను సోమవారం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆవిష్కరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయం విద్యుద్దీపాలంకరణతో, చలువ పందిళ్లతో కళకళలాడింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా స్వామివారి దర్శనం కల్పించేలా ఆలయ కమిటీ చర్యలు చేపట్టింది. షష్ఠి మహోత్సవాల్లో మంగళవారం సాయంత్రం లక్ష్మి శివ నామస్మరణం నిర్వహించనున్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ, మూడో తేదీ రాత్రి శివ నామస్మరణతో పాటు, సతీష్ ఆర్కెస్ట్రా మ్యూజికల్ నైట్, 4న చంద్రమాంపల్లి వారి నాటక ప్రదర్శన, 5న కోలాటం, 6న కాకినాడ వారి భైరవపుష్పం నాటకం, 7న డ్యాన్స్ పోటీలు ఉంటాయని తెలిపింది. షష్ఠి రోజు 7న వేకువజాము నుంచి ఏలేరు నదీస్నానాలు ఆచరించి స్వామి దర్శనం, ఉత్సవ నిర్వహణ ఉంటుందని పేర్కొంది. ఉదయం 11 గంటలకు దేవుని ఊరేగింపు, అదే రోజు రాత్రి భారీ బాణసంచా పోటీలు, శూలాల సంబరం ఉంటాయని వివరించింది.

మెగా పేరెంట్స్ డేను విజయవంతం చేయాలి

సామర్లకోట: రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల ఏడున నిర్వహించనున్న మెగా పేరెంట్స్ డేను విజయవంతం చేయాలని బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన విద్యా కమిటీ సమీక్షలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంపొందించి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి ప్రతిష్టాత్మకంగా మెగా పేరెంట్స్ డేను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు మంచి సూచనలు ఇవ్వడం ద్వారా విద్యార్థులకు మంచి పునాది వేయడానికి అవకాశం ఉంటుందన్నారు. విద్యా కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ హాజరయ్యే విధంగా చూడాలని విద్యా కమిటీ చైర్మన్ అక్కిన చక్రధర్ కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పి.సతీష్, చావా లక్ష్మి, ఎం దేవి, టి.రాఘవ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెయిలింగ్ పనులు ప్రారంభం

సాక్షి ఇంపాక్ట్



పిల్ల కాలువ వెంబడి జరుగుతున్న రెయిలింగ్ పనులు

సామర్లకోట: పట్టణంలోని స్థానిక గాంధీచౌక్ నుంచి రైల్వే గేటుకు వెళ్లే రోడ్డులో రైల్వే అధికారులు రెయిలింగ్ పనులు ప్రారంభించారు. అక్టోబరు ఐదున సాక్షిలో ‘అదుపు తప్పితే..అంతే’ శీర్షికన కథనం ప్రచురితమైంది. దాంతో స్థానిక రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం రమేష్, ఐఓడబ్ల్యూ రవి కాంత్ స్పందించారు. ప్రమాదకరంగా ఉన్న విషయాన్ని గమనించి దీనిని విజయవాడలోని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, రెయిలింగ్ పనులు చేయడానికి అనుమతి పొందారు. దాంతో స్థానిక రైల్వే అధికారులు గాంధీచౌక్ నుంచి రైల్వే గేటు వరకు రెయిలింగ్ పనులు చేపట్టారు. గాంధీ చౌక్ రోడ్డు, రైల్వే గేటు సమీపం నుంచి ఏలేరు కాలువ వరకు పిల్ల కాలువ ఉంది. ఈ రోడ్డు నిర్వహణ రైల్వే అధికారుల పరిధిలోకి వస్తుంది. దీంతో పిల్ల కాలువ వెంబడి ఇనుప కమ్మెలతో రెయిలింగ్ ఏర్పాటు చేశారు. ఈ రెయిలింగ్ పదేళ్ల క్రితమే కూలిపోయింది. దాంతో రోడ్డు నుంచి 15 అడుగుల లోతులో ఉన్న పిల్ల కాలువలోకి పశువులు పడి చనిపోతున్నాయి. వాహన చోదకులకు అపాయం పొంది ఉంది. ఈ క్రమంలో స్థానిక రైల్వే అధికారులు స్వయంగా పరిశీలించి, వాస్తవ పరిస్థితులను గ్రహించారు. స్థానికంగా జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా ఈ రెయిలింగ్ పనులు చేస్తున్నట్లు ఐఓడబ్ల్యూ రవికాంత్ తెలిపారు.

నీటి సంఘం ఎన్నికలు సమర్థంగా నిర్వహించాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి



శిక్షణకు హాజరైన ఉద్యోగులు

పెద్దాపురం: మండలంలోని ఈ నెల 8వ తేదీన నిర్వహించే సాగునీటి సంఘాల ఎన్నికలను సమర్థంగా నిర్వహించాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎన్నికల సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఇరిగేషన్ అధికారి శ్రీనివాస్‌కుమార్ అధ్యక్షత వహించారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ, సిబ్బంది నిబంధనలను అనుసరించి ఎన్నికల విధులు నిర్వర్తించాలన్నారు, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారన్నారు. శిక్షణలో ప్రతి అంశాన్ని దృష్టిలో ఉంచుకుని ఎన్నికలను సిబ్బంది సమర్థంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. మండలంలోని పెద్దాపురం, పులిమేరు, కాండ్రకోట, కట్టమూరు, తిరుపతి గ్రామాలకు సంబంధించి ఐదు నీటి సంఘాల పరిధిలో ఎన్నికలు ఉంటాయన్నారు. 8వ తేదీన ఆయా సంఘాల పరిధిలో ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డీటీ టి.కాంతారావు, ఆర్ఐ రమణ, ఆయా శాఖల అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పూల అలంకరణ



ఆకట్టుకున్న ఓం నమఃశివాయ అలంకరణ

సామర్లకోట: పవిత్ర పంచారామ క్షేత్రంలో కార్తిక మాస ఉత్సవాల ముగింపు సందర్భంగా కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయమంతా పూలతో అలంకరణ చేశారు. దీనిలో భాగంగా ఓం నమఃశివాయ అని పూలతో చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకుంది.



పాదగయక్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న పండితులు



పాదగయ క్షేత్రం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పురుహూతికా అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



రామలింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న పండితుడు

కార్తికం... పరిసమాప్తం

- ముగిసిన కార్తికమాసం
- పాదగయక్షేత్రానికి పోటెత్తిన భక్తులు
- భక్తిశ్రద్ధలతో పోలిస్వర్గం పూజలు



పాదగయ పుష్కరిణిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కొత్తపల్లి: కార్తికమాసం ముగింపును పురస్కరించుకుని సోమవారం పోలిపాడ్యమి వేడుకలు ఘనంగా జరిగాయి. పిఠాపురం పాదగయ పుణ్యక్షేత్రానికి తెల్లవారుజాము నుంచి భక్తులు పోటెత్తారు. పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి దీపాలు విడిచిపెట్టారు. ఉమాకుక్కుటేశ్వర స్వామి, పురుహూతిక అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలోని దత్తాత్రేయ కల్యాణ మంటపంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. అలాగే పిఠాపురం మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

వైభవంగా పాడ్యమి దీపాలు

కొత్తపల్లి: మండలవ్యాప్తంగా సోమవారం పోలి పాడ్యమి పూజలు ఘనంగా జరిగాయి. స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, బాలాత్రిపుర సుందరీ సమేత రాజశేఖరస్వామి, శ్రీధర్మశాస్తా, వీరబ్రహ్మేంద్రస్వామి, ఉప్పాడలోని మత్స్యలింగేశ్వరస్వామి, చౌడేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి, మల్లికార్జునస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. యండపల్లి, నాగులాపల్లి, గోర్స తదితర గ్రామాల్లోని ఉమారామ లింగేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలువలు, చెరువుల్లో పాడ్యమి దీపాలు విడిచిపెట్టారు.

ముగిసిన కార్తిక ఉత్సవాలు

సామర్లకోట: నెల రోజుల పాటు పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన కార్తిక మాస ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో పౌర్ణమి పూజలు, జ్వాలాతోరణం, స్వామివారి జన్మ నక్షత్రం సందర్భంగా ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహించారు. కార్తిక మాసం ముగింపు సందర్భంగా పోలి పాడ్యమిని పురస్కరించుకుని భక్త సంఘం ఆధ్వర్యంలో సాయంత్రం వెండి జటాజూటం అలంకరణ నిర్వహించారు. స్వామి వారికి వెండి జటాజూటం అలంకరణ సందర్భంగా ఆలయమంతా పూల అలంకరణతో నిండిపోయింది. స్వామివారిని తిలకించడానికి భక్తులు బారులు తీరారు. ఆలయంలో ఏర్పాటు చేసిన వీరభద్రుని నృత్యం భక్తులను అలరించింది. స్వామివారి జటాజూటం అలంకరణ తిలకించడానికి ఉచిత దర్శన లైను మాత్రమే ఏర్పాటు చేశారు. దాంతో కిలోమీటరు పొడవున భక్తులు బారులు తీరారు. సీఐ ఎ.కృష్ణభగవాన్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈఓ భళ్ల నీలకంఠం, ఉత్సవాల ప్రత్యేకాధికారి కేవీ సూర్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు ఆధ్వర్యంలో ఆలయ పండితులు భక్త సంఘం సభ్యులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప స్వామివారి జటాజూటం అలంకరణను తిలకించారు., భక్త సంఘ సభ్యులు గంజి బూరయ్య, బిక్కిన సాయి, తలుపుల అంజనీకుమార్, బీవీ రమణ, చల్లా సత్తిబాబు, కౌన్సిలర్లు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు సేవలందించారు.

కార్తిక దీపాలకు వీడ్కోలు

సామర్లకోట: కార్తిక దీపాలకు భక్తుల వీడ్కోలు పలికారు. పోలి పాడ్యమిని పురస్కరించుకుని సోమవారం తెల్లవారుజామున భక్తులు గోదావరి కాలువ, చెరువుల వద్దకు వెళ్లి దీపాలను విడిచి పెట్టారు. కార్తిక మాసం ప్రారంభం నుంచి నిత్యం ఉదయం, సాయంత్రం మహిళలు శివాలయాల్లో, ఇళ్ల వద్ద తులసి మొక్కల వద్ద నెల రోజుల పాటు కార్తిక దీపాలు వెలిగించారు. కార్తిక మాసం ముగింపును పురస్కరించుకుని అరటి డొప్పలలో దీపాలు పెట్టి, పూజలు చేసి ప్రవహించే నీటిలో వీడ్కోలు పలికారు. సామర్లకోట గోదావరి కాలువ వెంబడి కార్తిక దీపాల వీడ్కోలు సందడితో కనిపించింది. అధిక సంఖ్యలో మహిళలతో పాటు, దంపతులు కూడా కార్తిక దీపాలను గోదావరి కాలువలో విడిచి పెట్టారు. బ్రాహ్మణులకు దక్షిణ తాంబులాలు అందజేసి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు.



ఉప్పాడలో రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పంచారామ క్షేత్రంలో బారులు తీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో మూలవిరాట్



బాలాత్రిపుర సుందరి అమ్మవారు